రెబ్బెన: కొమురవెల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తిర్యాణి: పంగిడిమాదరలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

- ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి
- ఆదరించి ఆశీర్వాదించాలని అభ్యర్థన
- గ్రామాల్లో విస్తృత ప్రచారం

లింగాపూర్ : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి

లింగాపూర్, నవంబర్ 1: తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యపడుతుందని, ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని చిన్న దంపూర్, జముల్‌ధార, అమృత్‌గూడ, గోపాల్‌పూర్, వంజారిగూడ, కొత్తపల్లి, కంచన్‌పల్లి, ఘుంనూర్‌తో పాటు పలు గ్రామాల్లో పర్యటిస్తూ, ఎన్నికల ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రస్తుతం కొత్తగా చేపట్టే సంక్షేమ పథకాల మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సిర్పూర్(యు) మండలంలో ఉన్న లింగాపూర్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో పరిపాలన అందించి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధితో సీఎం కేసీఆర్ పరిపాలన దేశంలోనే ఆదర్శప్రాయమని, ఇక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాలు అందరిని ఆకర్శిస్తున్నాయని కొనియాడారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, వ్యవసాయానికి పెట్టుబడి సహాయం అందించి అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చారన్నారు. ఇతర పార్టీల నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. గిరిజనులకు పోడుభూముల పట్టాలతో పాటు రైతుబంధు అందించి ఆదుకున్న బీఆర్ఎస్‌కే అండగా నిలవాలని, రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. తెల్ల రేషన్ కార్డులందరికీ సన్నబియ్యం, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్‌లను పెంచి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్, వైస్ ఎంపీపీ ఆడే ఆత్మారాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆత్రం అనిల్ కుమార్, నాయకులు తొడసం ధర్మరావ్, లక్యానాయక్, విశ్వంబర్, వంగయ్యనాయక్, బాపురావ్, కిషన్, శేఖర్ పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

• గెలుపేలక్ష్యంగా పని చేయాలి

ఆసిఫాబాద్,నవంబర్ 1: గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టణ నాయకుల, కార్యకర్త సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమయం ఎక్కువగా లేదు మీకు కేటాయించిన బూత్ స్థాయిలో కోవ లక్ష్మి ప్రచార కరపత్రాలు,వాల్‌పోస్టర్లను అంటించడంతో పాటు పార్టీ మ్యానిఫెస్టోను బూత్ పరిధిలోని ప్రజలకు ఇస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు,సంక్షేమ కార్యక్రమలను వివరిస్తూ ప్రచారం చేయాలన్నారు. కార్యకర్తలు సమన్వయంతో కలిసి పని చేసి బీఆర్ఎస్ కారు గుర్తుకు వేటు వేయాలని ఓటర్లను అభ్యర్థించాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి కీలకమని బాధ్యతగా పని చేస్తేనే గెలుపు సాధ్యం అవుతుందన్నారు. ఏదో చేప్పింద్రు చేస్తాములే అనుకుంటే పొరపాటు జరుగుతుందన్నారు. పట్టణంలో 17 పోలింగ్ బూత్‌లున్నాయని వాటికి సంబంధించిన సామగ్రిని కమిటీ సభ్యులకు అందజేస్తామని చెప్పారు. గురువారం నుంచి రంగంలోకి దిగి ప్రచారం కొనసాగించాలన్నారు. కోవలక్ష్మికి నాకు ఎలాంటి వర్గ విభేదం లేదని ఎవరికైనా అలాంటి అపోహలుంటే పక్కన పెట్టాలన్నారు. అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ,అభివృద్ధితో ముందుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కోవలక్ష్మి,ఎమ్మెల్యే ఆత్రం సక్కు చేపట్టిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటున్న కోవలక్ష్మి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్,సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకటేశ్వర్లు,పార్టీ పట్టణ అధ్యక్షుడు హైమద్, నాయకులు రాజేశ్వర్,జీవన్,అన్సార్, సాజీద్,అబ్దుల్లా, అమన్,చిలుకురి రవి,శైలేందర్, కార్తీక్, ప్రసాద్‌గౌడ్, రఫీ, నజీర్, ఖాలీద్, ఇర్ఫాన్, సత్తన్న, రమేశ్, గిరి,నజీర్ పాల్గొన్నారు.

• సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష

తిర్యాణి, నవంబర్ 1: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు,జెడ్పీ చైర్మన్, ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి కోవ లక్ష్మి చేసిన అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామ రక్ష అని మండలాధ్యక్షుడు,ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మాండ్ల జగదీశ్ అన్నారు. మండలంలోని పంగిడిమాధర,చింతలమాధర,గీతమందిర్,కొలాంగూడ,తదితర గ్రామాల్లో ఇంటింటా గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధితో పాటు పలు సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ అభ్యర్థులను మూడోసారి గెలిపిస్తాయన్నారు.ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కోవ లక్ష్మిని గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్రం యూత్ పోర్స్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం వినోద్, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్,పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంతరావు, మండలాధ్యాక్షుడు కుర్సెంగ బాదిరావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రాజయ్య, శంకరయ్య,బ్రహ్మం, రేగోండ రమేశ్, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

• గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

రెబ్బెన, నవంబర్ 1: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు కేసీఆర్ మ్యానిఫెస్టోలోని అంశాలను గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లికి ఓటర్లకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

• బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలి

రెబ్బెన, నవంబర్ 1: ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని గోలేటిటౌన్‌షిప్ కార్మికకాలనీనలో బుధవారం సాయంత్రం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు, మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలపై అవగాహన కల్పిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ జీఎం కమిటీ మెంబర్ మారిన వెంకటేశ్వర్లు, నాయకులు దాసరి సాంబగౌడ్, సంపతి తిరుపతి, హనుమండ్ల సత్యనారాయణ, కైత స్వామిలతో పాటు పలువురు ఉన్నారు.

ఆసిఫాబాద్: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

గోలేటిటౌన్‌షిప్‌లో కోవ లక్ష్మికి మద్దతుగా ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఆసిఫాబాద్ టౌన్: విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డిస్తున్న డీఈవో అశోక్

సీఎం బ్రేక్ ఫాస్ట్‌తో హాజరు శాతం పెరిగింది

ఆసిఫాబాద్ టౌన్,నవంబర్1: సీఎం బ్రేక్ ఫాస్ట్‌తో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్ పేర్కొన్నారు. బుధవారం మం డలంలోని చిర్రకుంటలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ నిర్వాహణను పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి పిల్లలతో కలిసి ఆల్పాహారం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ఈ సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం జిల్లాలోని అన్ని పాఠశాలలకు విస్తరింపచేస్తామన్నారు. అనంతరం స్కూల్ ఎడ్యుకేషన్ అచీవ్మెంట్ సర్వే గురించి ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులతో చర్చించారు. మాడల్ టెస్టులను ఏ విధంగా నిర్వహి స్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈనెల 3న నిర్వహించనున్న అచీవ్మెంట్ పరీక్షలు నిర్వహణ గురించి ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ కటుకం మదుకర్, క్వాలిటీ కోఆర్డినేటర్ అభిద్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనరాజ్, సీసీఓ సోను ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ల పంపిణీ

వాంకిడి నవంబర్ 1: పోలీస్‌స్టేషన్‌లో ఇందాని గ్రామానికి చెందిన క్రీడాకారులకు బుధవారం వాలీబాల్ కిట్లను ఎస్సై డోలకాసి సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, యువత చెడు వ్యాసనాలు, చెడుమార్గాల వైపు పోకుండా సన్మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ క్రైమ్‌లపై యువకులకు అవగాహన కల్పించారు..ఈకార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, హెడ్ కానిస్టేబుల్ గణేశ్, పోలీస్ సిబ్బంది మహేశ్ ,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

కుమ్రం భీం పోరాటం అందరికీ ఆదర్శం

కెరమెరి : భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ మోతీరాం, ఆదివాసీలు

కెరమెరి, నవంబర్ 1: ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం పోరాటం అందరికీ ఆదర్శమని, ఆయన చేసిన పోరాట ఫలితంగానే ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఎంపీపీ పెందోర్ మోతీరాం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సాకడ ఎక్స్‌రోడ్డు వద్ద కుమ్రంభీం 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భీం వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా సాకడ గ్రామం నుంచి ఆదివాసీలు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా తరలి వచ్చారు. అనంతరం భీం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావు, సర్పంచ్ మడవి సుమిత్రాబాయి, గ్రామ పటేల్ పెం దోర్ దంబీరావు, మాజీ సర్పంచ్ జల్పత్‌రావు, నాయకులు పెందోర్ శ్రీనివాస్, తుకారాం, వినేశ్, సాగర్, లచ్చు, బిలాజీ, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా బులాయ్ వేడుకలు

రెబ్బెన, నవంబర్ 1: మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీలో గల అంబేద్కర్‌నగర్ కాలనీ లో బుధవారం రాత్రి బులాయ్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం దసర పండుగ రోజు నుంచి ప్రతి రోజు బులాయ్ అటలు ఆడి ఏడు లేదా తొమ్మిదో రోజున నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మహిళలు, యువతులు ప్రతి రోజు కోరిన కోరికలు తీరలని ప్రార్థనలు చేసి బులాయ్ ఆటలు ఆడటం జరుగుతుందని తెలిపారు.

నగదు పట్టివేత

వాంకిడి, నవంబర్ 1: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా చెక్ పోస్ట్ వద్ద బుధవారం ఉదయం సీఐ శ్రీనివాస్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు నిర్వహించారు. సీఐ వాహనాలు తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోయాబ్ అనే వ్యక్తి కారులో తనిఖీ చేయగా సరైన పత్రం లేకుండా తరలిస్తున్న రూ.5 లక్షల 50 వేలు పట్టుబడినట్లు సీఐ,ఎస్సై తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.